సాక్షి చిత్తూరు

గురువారం । 17 । ఆగస్టు । 2023



పేదింటికి ఉచిత వెలుగులు

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం వారి ఇళ్లకు విద్యుద్దీకరణ పనులను చురుగ్గా చేపడుతోంది. - 8లో



సీఎం సభకు స్థల పరిశీలన

నగరిలో ఈ నెల 25వ తేదీన సీఎం సభ నిర్వహణకు జిల్లా కలెక్టర్, ఎస్పీ బుధవారం స్థల పరిశీలన చేశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	37	27
తిరుమల	32	22
గూడూరు	38	29
నగరి	37	27

న్యూస్‌రీల్

శబరిమలైకి మంత్రి పెద్దిరెడ్డి



ఇరుముడితో వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎంపీ రెడ్డెప్ప

తిరుపతి మంగళం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం శబరిమలైకి బయలుదేరారు. మండలం రోజులపాటు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్ష ధరించిన ఆయన తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ఇరుముడి ధరించి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ తదితరులతో కలిసి స్వామియే శరణం అయ్యప్పా అంటూ రైలులో బయలుదేరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తదితరులు వారికి వీడ్కోలు పలికారు.

వినాయకుని సేవలో మంచు విష్ణు



మంచు విష్ణుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని సినీ హీరో, మా అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌కు ఇద్దరు సభ్యుల నియామకం

చిత్తూరు అర్బన్: నగరంలోని శాశ్వత లోక్ అదాలత్‌కు ఇద్దరు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్యప్రభాకర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చిత్తూరు నగరానికి చెందిన డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, చిరంజీవిరెడ్డి నియమితులయ్యారు. వీరు ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 78,726 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,436 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.94 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

అమూల్ డెయిరీ పరిశీలన



డెయిరీ ఆవరణలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు అగ్రికల్చర్: నగరంలోని అమూల్ డెయిరీ (విజయా డెయిరీ)ని బుధవారం జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డెయిరీ ఆవరణలోని పరిసరాలను పరిశీలించి, ఈ నెల 20వ తేదీలోపు డెయిరీలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలను శుభ్రపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే డెయిరీ పనులు ప్రారంభించేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ బ్రహ్మానందరెడ్డి , డెయిరీ అభివృద్ధి అధికారి రవిచంద్రన్, డీఎల్‌సీఓ వనజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మకు ప్రేమతో..!

మాతా శిశుమరణాల కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది. తల్లుల ఆరోగ్య పరిరక్షణకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. అమ్మ కడుపు కోతలను నివారించాలని సంకల్పించింది. పురిటినొప్పులొస్తే 108 కుయ్‌కుయ్‌మంటూ ఇంటి ముందు కు వస్తోంది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు 102 డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోంది. కొత్తగా హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి తరలించే రవాణా సేవలకూ రైట్ రైట్ చెప్పింది.

- మాతాశిశు మరణాల కట్టడికి చర్యలు
- వైద్యంతోపాటు వాహన సేవల వినియోగం పెంపు
- ఇప్పటికే తల్లీబిడ్డల సేవలో 102 ఎక్స్‌ప్రెస్
- ఇక హైరిస్క్ గర్భిణుల సేవలకు ఉచిత రవాణా
- ఆస్పత్రికి తీసుకెళ్లి..తిరిగి ఇంటికి చేర్చేలా ఆదేశాలు

చిత్తూరు రూరల్: మాతా శిశుమరణాలను నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో పలు మార్పులు తీసుకొస్తోంది. మహిళ గర్భం దాల్చిన మొదలు.. ప్రసవం అయ్యేంత వరకు వైద్యం పక్కాగా అందేలా చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వంలో తల్లీబిడ్డ వాహనాల ద్వారా ఇంటికి చేరుకోవాలంటే పురిటి నొప్పులు పడేవారు. ఈ కష్టాలను చూసిన ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో కొత్తగా 102 వాహనాలను తీసుకొచ్చింది. అప్పటి నుంచి వాహనంలో ఒక తల్లీబిడ్డను మాత్రమే అనుమతిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు. ప్రతినెలా 600 మందికిపైగా ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. ఈ సేవల దృష్ట్యా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవ కేసులు సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది.

కొత్తగా హైరిస్క్ గర్భిణులకు..

రాష్ట్ర ప్రభుత్వం 102 వాహనాల ద్వారా తల్లీబిడ్డను ఇంటికి చేర్చే ప్రక్రియతో పాటు ఇకపై హైరిస్క్ గర్భిణులకు సురక్షిత వాహన సేవలను అందించనుంది.

- ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి ఇంటికి చేరుస్తారు.
- ఫోన్ చేసిన 48 గంటలలోగా ఆస్పత్రిలో చేర్చుతారు.
- రక్తహీనత లోపం ఉన్న గర్భిణులు రక్తం ఎక్కించుకునేందుకు ఈ వాహనాన్ని వినియోగించుకోవచ్చు.
- ప్రసవ సమయానికి క్షేత్రస్థాయిలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు సమాచారం చేరవేస్తారు. వారు దగ్గరుండి హైరిస్క్ గర్భిణులకు ప్రసవ సమయానికి 102 రవాణా సేవలు అందే లా చూస్తారు. ఇందుకు మార్గదర్శకాలు జారీ చేశారు.
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అందించిన వివరాల ఆధారంగా 102 డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా కోఆర్డినేటర్ కూడా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. గర్భిణులను ఆస్పత్రికి చేర్చడం కోసం 8220816837ను సంప్రదించవచ్చు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సమాచారం

నెల	సేవలు పొందిన వారి సంఖ్య
ఏప్రిల్	614
మే	625
జూన్	574
జులై	651

జిల్లాలో ఇలా..

102 డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ వాహనాలు	16
జిల్లా ఆస్పత్రిలో	6
కుప్పం ఏరియా ఆస్పత్రిలో	2
నగరి ఏరియా ఆస్పత్రిలో	2
పలమనేరులో ఏరియా ఆస్పత్రిలో	1
పుంగనూరు ఏరియా ఆస్పత్రిలో	1
వి.కోట సీహెచ్‌సీలో	1
బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో	1
కార్వేటినగరం సీహెచ్‌సీలో	1
బంగారుపాళ్యం సీహెచ్‌సీలో ఒకటి	

ఖర్చులేని సేవలు



మాది జీడీనెల్లూరు మండలం ముక్కళతూరు. నాలుగు రోజుల కిందట పురిటినొప్పులు రావడంతో ఆటోలో చిత్తూరు జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించాం. సుఖ ప్రసవం చేశారు. ఇంటికి వెళ్లేటప్పుడు 102 సదుపాయం కల్పించారు. నేను, నాకు తోడుగా ఉన్న ఆమెను మాత్రమే వాహనంలో ఎక్కించారు. ఇలాంటి సేవలు మాలాంటి వాళ్లకు ఎంతోగాను ఉపయోగపడుతాయి. **– దివ్య, ముక్కళతూరు, జీడీనెల్లూరు**

మెరుగైన సేవలు



ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యం అందిస్తోంది. నేను 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చాను. వెళ్లేటప్పుడు కూడా ఉచితంగానే 102లో వదిలి పెట్టారు. మాకు రూపాయి ఖర్చు కాలేదు. ఇప్పుడు రక్తహీనత సమస్య ఉంటే రక్తం ఎక్కించడానికి కూడా 102ను వినియోగంలోకి తేవడం ఆనందంగా ఉంది. మాలాంటి వారికి ఈ సేవలు ఎంతో ఉపయోగం. **– లక్ష్మి, ఐరాల మండలం**

సద్వినియోగం చేసుకోవాలి



జీవనశైలిలోని మార్పులు, శారీరక లోపాల కారణంగా తల్లులను రక్తహీనత వంటి సమస్యలు ఇబ్బంది పెడుతాయి. వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. హైరిస్క్ గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లో రక్తం ఎక్కించడానికి, సకాలంలో వారిని ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి ఇంటికి చేర్చడానికి 102 రవాణా సేవలను విస్తృతం చేసింది. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. **– డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**

త్యాగమూర్తుల రుణం తీర్చుకుందాం



నగరిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యం
- రాష్ట్రంలో డాక్టర్ అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయం
- నా భూమి–నా దేశం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

నగరి : తరతరాలుగా పడిన యాతన తీర్చి, బానిస సంకెళ్ల నుంచి విముక్తి ప్రసాదించిన త్యాగమూర్తులను స్మరించుకుందాం.. మన రుణం తీర్చుకుందాం అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్ ఆవరణలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలిసి మొక్కలు నాటి పతాకావిష్కరణ చేశారు. అందరితో 'ఈ దేశాన్ని గౌరవిస్తాం.. ఈ దేశాన్ని రక్షిస్తాం.. ఈ దేశాన్ని అభివృద్ధి చేయడంలో మేమందరం భాగస్వాములవుతాం.' అని మట్టి చేతులతో ప్రమాణం చేయించారు. అనంతరం మట్టిని కుండల్లో సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్య్రం వెనుక ఎందరో స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలం ఉందన్నారు. వారి ప్రాణత్యాగం నేడు మనకు స్వాతంత్య్రాన్ని ఇచ్చిందన్నారు. అలాంటి త్యాగమూర్తులను స్మరించుకుని వారి రుణం తీర్చుకోవడంతోపాటు వారి కీర్తిని భావితరాల వారికి తెలియజెప్పాలన్నారు. అందుకే వారికి గుర్తుగా మొక్కలు నాటుతూ శిలాఫలకాలను ప్రారంభించడం జరుగుతోందన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి సేకరించిన మట్టి ఢిల్లీ వరకు చేరుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన మట్టితో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్మారక స్థూపాన్ని కట్టి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. అంటే ఆ నిర్మాణంలో దేశప్రజలందరి పాత్ర ఉన్నట్లే అన్నారు. మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకువచ్చారన్నారు. రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేడ్కర్ కోరుకున్న సమ సమాజాన్ని వారి వారసుడిగా నేడు పూర్తి స్థాయిలో నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. దేశభక్తితో అందరూ ముందడుగు వేయాలన్నారు. నా భూమి–నా దేశం అన్న భావన అందరిలో కలిగితే దేశ ప్రగతికి విఘాతం కలిగించే పనులు ఎవరూ చేయరన్నారు.

త్యాగనిరతిని భావితరాలకు చెప్పేందుకే..

మనకు స్వాతంత్య్రం తేవడానికి కృషి చేసిన ఎందరో సమరయోధుల త్యాగనిరతితో పాటు స్వాతంత్య్రం ఎంత విలువైందో భావితరాలకు చెప్పేందుకు నాభూమి–నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారని జిల్లాకలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రస్తుతం ఉన్న అవకాశాలను ఎంత వరకు మనం ఉపయోగించుకోగలం? ఎంతవరకు ముందుకెళ్లగలం? అన్నది ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ డీఈ నరేష్, హౌసింగ్ డీఈ శంకరప్ప, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్ పాల్గొన్నారు.

మహానుభావుడు జగనన్న



ఉపముఖ్యమంత్రి నారాయణస్వామికి తన అభిప్రాయాన్ని వివరిస్తున్న రత్నమ్మ

- గడపగడపలో గిరిజన మహిళ

సాక్షి, తిరుపతి: మహానుభావుడు జగనన్న అని పులికల్లు ఎస్టీ కాలనీకి చెందిన రత్నమ్మ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఎదుట రెండు చేతులెత్తి దండం పెడుతూ చెప్పింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గంగాధర నెల్లూరు నియోజకవర్గం పెనుమూరు మండలం పులికల్లు సచివాలయ పరిధిలో పర్యటించారు. ఎస్టీ కాలనీలో పర్యటిస్తున్న సమయంలో ఆయన గిరిజనులను పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? ఇంకేమైనా అవసరాలు ఉన్నాయా? అని అడిగారు. ప్రస్తుతం ఉన్న కాలనీలో నివాసాలన్నీ వర్షం వస్తే ఉరుస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంటనే హౌసింగ్ అధికారులను పిలిపించి, గిరిజన కాలనీ వాసులందరికీ పక్కాగృహాలు నిర్మించి ఇవ్వమని ఆదేశించారు. మరోసారి వచ్చేలోపు పక్కాగృహాలు నిర్మాణాలు జరుగుతుండాలన్నారు. ఈ సందర్భంగా రత్నమ్మ అనే గిరిజన మహిళను ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి పలకరించారు. 'మహానుభావుడు జగనన్న.. ఆ దేవుడు వచ్చాక మాకు అన్నీ సక్రమంగా అందుతున్నాయి. అంతా సంతోషంగా ఉన్నాం' అంటూ చేతులెత్తి మొక్కారు.

నా ఏడుపైనా కరిగించలేదా.. అమ్మా?

దేవతకు ప్రతిరూపం..అనురాగం, ఆప్యాయత పంచేది అమ్మ..లోకం నిన్ను ద్వేషించినా నిన్ను ప్రేమించేది అమ్మ.. జన్మజన్మల బంధం అమ్మ.. లోకంలోనే అంతటి గొప్ప పదానికే ఓ తల్లి మచ్చతెస్తే.. పురిట్లోనే పేగు బంధం తెంచేస్తే.. భారం తనకొద్దంటూ కనిపారేస్తే.. ఆ పసిప్రాయం ఎంత విలవిల్లాడి ఉంటుంది.. ఆ హృదయం ఎంత యాతన పడి ఉంటుంది.. ఆ గొంతు ఎంత తడారిపోయి ఉంటుంది.. అమ్మతనానికే మచ్చ తీసుకొచ్చిన హృదయ విదారకర ఘటన చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది.

- చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి బాత్‌రూమ్‌లో ప్రసవం
- ఆపై పసికందును వదిలి తల్లి పరారీ
- ఎస్ఎన్‌సీయూలో బిడ్డకు చికిత్స



చికిత్స పొందుతున్న బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సూపరింటెండెంట్



పసికందు

చిత్తూరు రూరల్: ఏ కష్టం వచ్చిందో తెలియదు కానీ ఆ తల్లి మాతృత్వపు మమకారాన్ని సైతం కాదనుకుంది. తల్లి పొత్తిళ్లలో సేద తీరాల్సిన పసికందును చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి బాత్‌రూమ్‌లో వదిలి వెళ్లిపోయింది. అటు వైపుగా వెళ్లిన స్వీపర్, సెక్యూరిటీ సిబ్బంది చిన్నారిని చూసి, ఎస్ఎన్‌సీయూ డాక్టర్లకు అప్పగించారు. అధికారుల కథనం మేరకు.. 19 ఏళ్ల వయస్సున్న ఓ గర్భిణి కడుపు నొప్పి అంటూ బుధవారం వేకువజామున 4.30 గంటలకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని ఆశ్రయించింది. అక్కడి డ్యూటీ డాక్టర్లు ఆమెపై అనుమానం రావడంతో.. మీరు గర్భిణినా? అని అడిగారు. కాదంటూ ఆ గర్భిణి, ఆమె వెంట వచ్చిన ఇద్దరు వ్యక్తులు వాదించడంతో చివరకు డాక్టర్ ఆమెకు పరీక్షలు చేయించుకోవాలని టెస్ట్‌లు రాసి ఇచ్చారు. అయితే పురిటినొప్పులు అధికమై గర్భిణి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. అక్కడే ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి.. పసికందును బాత్‌రూమ్‌లోనే వదిలి పరారైంది. వారి వెంట వచ్చిన ఇద్దరు వ్యక్తులు కూడా కనిపించకుండా మాయమయ్యారు. అటూ వైపుగా వెళ్లిన స్వీపర్ మోహనమ్మ, సెక్యూరిటీ సందీప్ పసిగుడ్డు ఏడుపును గుర్తించారు. వెంటనే డాక్టర్లకు సమాచారం అందించి, బిడ్డను ఎస్ఎన్‌సీయూకు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న బిడ్డను ఆస్పత్రి అధికారులు ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. బిడ్డ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. అయితే ఆ తల్లి బాత్‌రూమ్‌లో పసికందును ఎందుకు వదిలి వెళ్లింది? ఆడబిడ్డ అని వదిలేసేరా? మరేమైనా ఇతర కారణాలున్నాయా? అనే కోణంలో ఆస్పత్రి అధికారులు విచారిస్తున్నారు. సీసీ పుటేజీలను పరిశీలించనున్నారు. తర్వాత పోలీసులను ఆశ్రయిస్తామని సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ వెల్లడించారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

- ఈ నెల 25 నగరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఏర్పాట్లపై ఉన్నతాధికారులు సమీక్ష
- మార్పులు, చేర్పులు బీఎల్వోలతోనే నిర్వహించాలి
- సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వెల్లడి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఓటర్ల కసరత్తు పర్యవేక్షణకు జిల్లావ్యాప్తంగా మండల, నియోజకవర్గస్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 45 శాతం ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల పరిశీలన ప్రస్తుతం ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతోందని, తర్వాత ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. మార్పులు, చేర్పుల కసరత్తు బీఎల్‌ఏలు, బీఎల్వోలతో కలిసి నిర్వహిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, సురేంద్రకుమార్, భాస్కర్, లోకనాథన్, నాగరాజన్ పాల్గొన్నారు.

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

జిల్లావ్యాప్తంగా ఎండీయూ వాహనాలతో చేపడుతున్న రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పురోగతికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ పంపిణీ కార్యక్రమం గురువారం సాయంత్రంలోపు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల పురోగతి వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. అసైన్‌మెంట్ భూముల ప్రక్రియలో జిల్లాలో 3,110 మందికి 3,581 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కసరత్తు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న జిల్లాలోని నగరి పర్యటనకు విచ్చేయనున్నట్లు ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక సమాచారం వచ్చిందని జేసీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా అధికారుల సమీక్షలో జేసీ మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నగరిలో జగనన్న విద్యాదీవెన రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సీఎం పర్యటనకు సంబంధించి శాఖల వారీగా కేటాయించిన విధుల నిర్వహణపై సమీక్షించారు. డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఈవో విజయేంద్రరావు, సోషల్‌వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా క్యాన్సర్ వెబ్ అప్లికేషన్

తిరుపతి అర్బన్ : ఎంట్రో ల్యాబ్స్ వారి క్యాన్సర్ వెబ్ అప్లికేషన్‌ను మరింత పకడ్బందీగా రూపొందించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యసిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇప్పించామన్నారు. స్విమ్స్ , టాటా క్యాన్సర్ ఆస్పత్రుల డాక్టర్లు సూచనల మేరకు పోర్టల్‌లో మరికొన్ని ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. ప్రతి సచివాలయ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలకు లాగిన్ ఏర్పాటు చేయాలన్నారు. బాధితులు, అనుమానితులు, వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన వారిని మూడు కేటగిరీలుగా విభజించాలన్నారు. పింక్ బస్సు లు ఆయా సచివాలయ పరిధిలోకి వచ్చినప్పుడు ప్రజలకు పరీక్షలు నిర్వహించి పోర్టల్‌లో నమోదు చేసి వివరాలు స్విమ్స్ , టాటా కాన్సర్ ఆస్పత్రులకు వెంటనే చేరేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రేపు వెంకటగిరిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్ : వెంకటగిరి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పాస్,ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పూర్తిచేసిన వారు మేళాకు హాజరు కావచ్చన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు సర్టిఫికెట్లు , ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9491458910, 9177508279 నంబర్లలో సంప్రదించాలని కోరారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

వినాయకుని దర్శించుకున్న నాగస్వామి బృందం


వినాయకుని సేవలో గుజరాత్‌కు చెందిన నాగ స్వామి బృందంతో ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): గుజరాత్‌కు చెందిన నాగస్వామి అఘోరాల బృందం సభ్యులు 15 మంది బుధవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం వారు విచ్చేయగా ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సారా, కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: ఎస్ఈబీ అధికారులు వేర్వేరు చోట్ల దాడులు చేసి సారా, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ అధికారుల కథనం మేరకు.. ఎస్ఈబీ అధికారులకు రహస్య సమాచారం అందడంతో గుడిపాల మండలం చిత్తపార గ్రామంలో బుధవారం సారా తయారీ, విక్రయాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, విక్రేత రాందాస్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే చిత్తూరు నగరం లెనిన్ నగర్‌లో 21 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. మద్యం అమ్ముతున్న ఆర్ముగంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్ఐ బాబు, రాంప్రసాద్, సిబ్బంది బాబు, వెంకటేశ్వర్లు, జయశంకర్, జ్యోతి పాల్గొన్నారు.

పేదింటికి ఉచిత వెలుగులు

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగానే పేదల సొంతింటి కల సాకారం చేస్తోంది. జగనన్న కాలనీలు నిర్మిస్తోంది. ఈ కాలనీల్లో అన్ని మౌళిక వసతులు కల్పిస్తోంది. ఈ క్రమంలోనే ఆ ఇళ్లలో ఉచిత వెలుగులు ప్రకాశించనున్నాయి. జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులపై ప్రత్యేక కథనం.

- జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు
- నివాసాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు
- మీటరు, సర్వీసు వైర్, బోర్డు మంజూరు
- సొంత స్థలం ఉన్నా కనెక్షన్ ఉచితం


తొండవాడ జగనన్న కాలనీలో విద్యుద్దీకరణ పనులు

చిత్తూరు కార్పొరేషన్/చిత్తూరు అగ్రికల్చర్: పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అక్కడ విద్యుద్దీకరణ పనులను చురుగ్గా చేపడుతోంది. జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తుండగా మెరుగైన సరఫరా కోసం సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నారు. అంతే కాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా నివాసితులకు ఉచితంగా విద్యుత్ మీటర్, సర్వీసు వైర్, బోర్డులు అందజేస్తోంది. అవసరమైన సర్వీసులకు ఉచితంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, లైన్ లాగి కరెంట్ ఇవ్వనున్నారు. సొంత స్థలం కలిగి గృహ నిర్మాణానికి హౌసింగ్‌లోన్ మంజూరు అయినవారికి కూడా ఈ సేవలను ఉచితంగా అందిస్తోంది. వీటితో పాటు భవిష్యత్‌లో ఉచితంగా ఫ్యాన్, ట్యూబ్‌లైట్, ఎల్ఈడీ బల్బుల ఇవ్వడానికి ఒప్పందం చేసుకుంది.

ఉచితంగా విద్యుత్ మీటర్లు

ఉమ్మడి జిల్లాలో జగనన్న లే అవుట్లు మొత్తం 1,040 ఉండగా వీటిలో 567 లే అవుట్లలో విద్యుద్దీకరణ పనులు పూర్తి చేశారు. మొత్తం లే అవుట్లలో 10,915 సర్వీసులకు ఉచితంగా మీటర్లు అందిస్తున్నారు. వీటితో పాటు కాలనీల బయట సొంత స్థలం కలిగి గృహ నిర్మాణానికి ప్రభుత్వ హౌసింగ్ లోన్ కింద రుణం పొంది ఇళ్లు నిర్మించుకున్న 46,139 మందికి ఉచితంగా కనెక్షన్లు ఇచ్చారు. ఒక్కొక్క సర్వీసుకు దాదాపు రూ.3 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసినందుకు గాను రూ.3.27 కోట్లు ఖర్చు కాగా, సొంత స్థలం ఉన్నవారికి 46,139 మీటర్లు ఇచ్చినందుకు రూ.13.87 కోట్లు వ్యయం చేశారు. మొత్తం 57,054 మీటర్లకు రూ.17.14 కోట్లు ఖర్చు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు 16 కేవీఏ సింగిల్ ఫేజ్ 1,254, 25 కేవీఏ సింగిల్ ఫేజ్ 696, 25 కేవీఏ త్రీ ఫేజ్ 16, 63 కేవీఏ 22, 100 కేవీఏ 567, 160 కేవీఏ 197ను ఏర్పాటు చేశారు. అలాగే గృహాలకు విద్యుత్ సరఫరా చేయడానికి 23,820 స్తంభాలు ఏర్పాటు చేసి 1,91.6 కిలోమీటర్లు హెచ్‌టీ, 770 కిలోమీటర్లు ఎల్‌టీ లైన్లు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల 2,752 ఏర్పాటు కాగా వీటి కోసం రూ.28 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇప్పటివరకు విద్యుద్దీకరణ పనుల కోసం రూ.62.30 కోట్లు చేశారు. మొత్తం రూ.118.53 కోట్లతో విద్యుద్దీకరణ పనులకు టెండర్లు పూర్తి చేశారు. మొత్తం పనులు పూర్తయితే 1,07,840 సర్వీసులకు విద్యుత్ సరఫరాను ఇవ్వనున్నారు.

రూ.9 కోట్లతో సబ్‌స్టేషన్లు

ఉమ్మడి జిల్లాలోని తిరుపతిలోని తొండవాడ, శ్రీకాళహస్తిలోని చిండేపల్లె, చిత్తూరులోని అన్నపల్లెలోని జగనన్న కాలనీల్లో రూ.3 కోట్ల వ్యయంతో ఒక్కొక్క సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఆ లెక్కన కాలనీల్లో 3 సబ్‌స్టేషన్లను నిర్మాణానికి రూ.9 కోట్లు ఖర్చు చేయనున్నారు.

200 యూనిట్లు ఉచిత విద్యుత్

జగనన్న కాలనీల నందు నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ సర్వీసులకు దాదాపు రూ. వెయ్యి విలువైన 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సబ్సిడీ కింద ఇస్తున్నారు. భవిష్యత్‌లో నివాసాలకు ఉచితంగా ఎల్ఈడీ బల్బు, ట్యూబ్‌లైట్‌లు, ఫ్యాన్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్నది.

ట్రాన్స్‌ఫార్మర్లు	ఏర్పాటు చేసినవి
16 కేవీఏ	1,254
25 కేవీఏ	715
63 కేవీఏ	22
100 కేవీఏ	567
160 కేవీఏ	197
లైన్లు	**ఏర్పాటు చేసిన దూరం(కి.మీ.లలో)**
హెచ్‌టీ లైన్	192
ఎల్‌టీ లైన్	770
కాలనీల్లో ఇచ్చిన విద్యుత్ మీటర్లు	10,915
సొంత స్థలం ఉన్న వారికి ఇచ్చిన మీటర్లు	46,139
విద్యుత్ స్తంభాలు	23,820
విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్న నివాసాలు	1,07,842

నాణ్యంగా పనులు



జగనన్న కాలనీలో నందు నాణ్యంగా పనులు జరుగుతున్నాయి. వేలసంఖ్యలో గృహాలున్న ప్రాంతంలో ఒక్కొక్క సబ్‌స్టేషన్‌ను రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నాం. నివాసాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు, సంబంధిత పరికరాలు ఇస్తున్నాం. వీటితో పాటు హౌసింగ్ రుణం పొందిన వారికి కాలనీ బయట మీటర్లు అందజేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నాం. కాలనీలో నివాసముంటే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.

– కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

థ్యాంక్యూ సీఎం సార్...


రెడ్డెప్పరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : 20 ఏళ్లుగా ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యను పరిష్కరించినందుకు థ్యాంక్యూ సీఎం సార్ అని ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యను గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నెరవేర్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల నిబంధన తొలగించి వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేసేందుకు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జూనియర్ కళాశాలల్లో 510, డిగ్రీ కళాశాలల్లో 75, పాలిటెక్నిక్ 50 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లకు లబ్ధి చేకూరనుందని ఆయన వెల్లడించారు.

మద్యం వ్యాను బోల్తా


బోల్తా పడిన వ్యాను, ధ్వంసమైన మద్యం బాటిళ్లు

పూతలపట్టు: మద్యం వ్యాను బోల్తా పడిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎం.బండపల్లి సమీపంలోని మద్యం గోడౌన్ నుంచి పాకాలకు వెళుతున్న మద్యం వ్యాను పూతలపట్టు చెరువు క్రాస్ వద్ద వ్యాను ముందు టైరు పేలడంతో డివైడరుకు ఢీకొని బోల్తా పడింది. వ్యానులోని మద్యం బాటిళ్లు ధ్వంసమయ్యాయి. దీని విలువ సుమారుగా రూ.2 లక్షలు ఉంటుందని స్థానికులు తెలిపారు. మద్యం కోసం ఎగబడిన ప్రజలు కొంత మొత్తంలో మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వ్యాను నడుపుతున్న డ్రైవర్ స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

స్వర్ణముఖిలో 'పునీత్‌సాగర్ అభియాన్'



స్వర్ణముఖి నదీతీరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు గూడలి గ్రామం వద్ద పునీత్‌సాగర్ అభియాన్ కింద స్వర్ణముఖి నదీతీరాన్ని శుభ్రం చేశారు. లెఫ్టినెంట్ కమాండెంట్ వినయ్ రామచంద్రన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, నరేంద్రబాబు, నీలేష్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనకు అభినందనలు



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు తెలుపుతున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, కుప్పం ఇన్‌చార్జి భరత్, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని బుధవారం పద్మావతిపురంలోని ఆయన నివాసంలో శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ చైర్మన్‌గా నియమితులైనందుకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఆర్ఏఆర్ఎస్ ఉద్యోగుల అభినందనలు


అభినందనలు తెలుపుతున్న ఆర్ఏఆర్ఎస్, వ్యవసాయ కళాశాల అధికారులు, ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఆర్.శారద జయలక్ష్మీదేవి ఆర్ఏఆర్ఎస్ ఉద్యోగుల అభినందనలు తెలిపారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ఆర్.శారద జయలక్ష్మీదేవి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి బుధవారం సాయంత్రం రిలీవ్ ఆర్డర్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆర్ఏఆర్ఎస్, వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపి, ఘనంగా వీడ్కోలు పలికారు.

సీఎం సభకు స్థల పరిశీలన


జూనియర్ కళాశాలలో మంత్రి ఆర్కే రోజా , కలెక్టర్ షణ్మోహన్

నగరి : పట్టణంలో ఈ నెలలో జగనన్న విద్యాదీవెన అమలులో భాగంగా సీఎం సభ నిర్వహించనున్న నేపథ్యంలో స్థల పరిశీలన నిమిత్తం జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి బుధవారం నగరి పట్టణానికి విచ్చేశారు. సభ నిర్వహణ, హెలిప్యాడ్ ఏర్పాటు నిమిత్తం మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఆర్కే రోజాతో కలిసి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులకు ఏవైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సాధించిన ఫలితాలను ఆరా తీసిన ఆయన చదివేది ఏ కోర్సు అయినా అందులో ముందంజలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. అవగాహనతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డకు జరిగినట్టు..మరెవరికీ జరగకూడదు!


విచారణ జరుపుతున్న డీఎం అండ్ హెచ్ఓ ప్రభావతి, డీఐఓ రవిరాజు, ఇతర అధికారులు

చిత్తూరు రూరల్: 'మా బిడ్డకు జరిగినట్టు.. మరెవరికీ జరగకూడదు.' ప్రభుత్వాస్పత్రిలో మరణించిన పసికందు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు నగరం ఖాదర్ మీనాన్ వీధికి చెందిన సర్దార్, రోష్ని దంపతుల 20 రోజుల పసికందును చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి వారం రోజులకు క్రితం తీసుకొచ్చారు.ఆ సమయంలో యాంటీ బయోటిక్ ఇంజెక్షన్ ఇవ్వడంతో బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై బుధవారం డీఎం అండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి, డీఐఓ రవిరాజు, డీఎస్ఓ శిరీష, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ విచారణ చేపట్టారు. తల్లిదండ్రుల సమక్షంలో చేపట్టిన ఈ విచారణలో ఎస్ఎన్‌సీయూ డాక్టర్లు, సిబ్బంది బిడ్డ ఇన్ఫెక్షన్ వల్లే చనిపోయిందని చెప్పారు. దీనిపై స్పందించిన బాధితులు మాట్లాడుతూ ఆ మాట అవాస్తమని, బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే ప్రైవేటు ఆస్పత్రిలో చూపి, ఉంటామని వాదించారు. ఇన్ఫెక్షన్ ఉందనే విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ వేరే వారికి రాకుండా చూడాలన్నదే తమ కోరికని విచారణ నుంచి వారు తప్పుకున్నారు.

హైనా దాడిలో ఆవు మృతి

రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగులో రైతు సోమారెడ్డికి చెందిన ఆవుపై మంగళవారం రాత్రి హైనా దాడి చేసి చంపేసినట్లు కుప్పం అటవీ క్షేత్రాధికారి వైవీ రెడ్డి తెలిపారు. ఇంటి ఆవరణలో కట్టి ఉంచిన ఆవు మృతి చెందడంతో ఆవును చిరుతపులి చంపినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. కాలిముద్రికల ఆధారంగా ఆవుపై దాడి చేసింది హైనా అని, చిరుత కాదని వైవీ రెడ్డి తెలిపారు. అటవీ గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఘనంగా ఏడు గంగల జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: మండలకేంద్రంలో ఏడు గంగమ్మల జాతరను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతరకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు బలిజ సంఘం నాయకులు శరత్‌కుమార్, చలపతి సాదరంగా ఆహ్వానం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. నారాయణవనం, సముదాయం, కీళగరం, వీకే పాళ్యం, నాగిలేరు, బొప్పరాజుపాళ్యంలో ఏడు గంగమ్మలు విశేష అలంకరణలతో వేర్వేరుగా మంగళవారం రాత్రి ఊరేగింపునకు బయలుదేరారు. బుధవారం వేకువజామున అమ్మవారు ఆయా ప్రాంతాల్లో కొలువుదీరారు. భక్తులు పెద్దసంఖ్యలో గంగమ్మను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పిండి దీపాలను వెలిగించి, కుంభం సమర్పించారు. గంగమ్మను ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, పార్టీ నాయకులు ఏకాంబరం, గురుస్వామి, తులసిముని, మోహన్, సొరకాయలు దర్శించుకున్నారు. సాయంత్రం మాజీ ఎమ్మెల్యే హేమలత, హెలెన్ అమ్మవారిని సేవించుకున్నారు. అనంతరం నిమజ్జనం సందర్భంగా అమ్మవారి పసుపును పంచిపెట్టారు. ఎస్ఐ పరమేష్ నాయక్ బందోబస్తు నిర్వహించారు.